క్లుప్తంగా

అన్నదానానికి రూ.10 వేలు వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్రీ విశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో అన్నదానానికి దాతలు విరాళం అందించారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అన్నదానం కోసం విజయ దుర్గ స్టీల్ డి.ప్రసాద్ అధినేత శుక్రవారం రూ.10 వేలను ఆలయ కమిటీ బాధ్యుడు నాగండ్ల కోటికి అందించారు.

మహాసభ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 10వ తేదీన సూర్యాపేట పాత బస్టాండ్ పక్కన ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగే బహుజన రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర నాయకుడు పాడకంటి రాంబాబు కోరారు. శుక్రవారం ఖమ్మంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎందరో బహుజన నాయకులు ఎదిగి వారి కుల సంఘాల ఉద్యమాల ద్వారా వారి హక్కులు సాధించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగనబోయిన లక్ష్మణ్, దారా వెంకయ్య, కృష్ణ, దానియేలు దినేశ్, వెంకటేశ్వర్లు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని అజయ్‌తండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రపంచ పౌర దినోత్సవం సందర్భంగా దివ్యమూర్తి అభిమాన సంఘం ఆధ్వర్యాన నోట్ పుస్తకాలతో పాటు పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, బి.నాగేశ్వరరావు, విద్యా వలంటీర్ సల్మా, కమిటీ సభ్యులు దివ్యమూర్తి, సిద్దెల గురునాథం, బొడ్డు బాబూరావు, బి.సత్యనారాయణ, శంకర్‌నాయక్, ప్రభుదాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎంపీటీసీ

నేలకొండపల్లి: తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరట్లగూడెం ఎంపీటీసీ రేగూరి వాసవి కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం అందించారు. ముదిగొండ మండలంలో శుక్రవారం భట్టి పర్యటిస్తున్న సందర్భంగా వాసవి మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలను వివరించారు. అంతకు ముందు మండలంలోని కోనాయిగూడెం గ్రామ పంచాయతీలో రూ.2.25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

స్థానిక గిరిజనులకే అవకాశం కల్పించాలి

కామేపల్లి: ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ నియామకాలు స్థానిక గిరిజన అభ్యర్థులకే కల్పించాలని తెలంగాణ స్టేట్ ట్రైబుల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ ఈరునాయక్ ప్రభుత్వాన్ని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఆ దిశగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గిరిజన అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తుందన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై హర్షం

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్/ఖమ్మంసహకారనగర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 83 రోజుల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 11,062 పోస్టులను విడుదల చేయటం హర్షణీయమని యూత్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి నరేష్ అన్నారు. శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు నిదర్శనమని అన్నారు. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల పట్ల ఖమ్మంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్సా రమేశ్, ఖమ్మంరూరల్‌లో యువజన కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భూక్యా సురేశ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆయుష్ వైద్యురాలిపై విచారణ

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం వైద్య విధాన పరిషత్‌లోని ప్రకృతి వైద్యురాలు కనక మహాలక్ష్మి విధుల నిర్వహణపై సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు శుక్రవారం విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో వైద్యురాలు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేశారు. ఈ మేరకు వైద్య సిబ్బంది, గ్రామస్తులతో విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని నరసింహారావు తెలిపారు.

పేరుకే పెద్దాస్పత్రి..

అది పేరుకే పెద్దాస్పత్రి.. నిత్యం వేలాది మంది రోగులు వచ్చి పోతుంటారు.. వైద్య సేవల కోసం ఎక్కడెక్కడి నుండో వస్తుండడంతో జనాలతో రోజూ ఆస్పత్రి కిటకిటలాడుతుంటుంది. కానీ అంతర్గత రోడ్ల విషయానికొస్తే గతుకులు, గుంతలతో దర్శనమిస్తూ.. అధ్వానంగా కనిపిస్తుంది. ఎప్పుడో దశాబ్దం క్రితం వేసిన రోడ్లుకావడంతో అవి పూర్తిగా పాడైపోగా.. వాటిపై వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఖమ్మం వైద్యవిభాగం



ఆస్పత్రి ముందు భాగంలో తవ్వి కంకర వేసి వదిలేసిన రోడ్డు

అధ్వానంగా మారిన అంతర్గత రోడ్డు



అధ్వానంగా అంతర్గత రోడ్లు
- మెడికల్ కళాశాలలో ఓకే.. ఆస్పత్రిలో బ్రేక్
- గుంతలు, గతుకులతో రోగుల పాట్లు
- దశాబ్ది కాలం కావడంతో పాడైన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులు..

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిని అనుసంధానిస్తూ గతేడాది ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బోధన కూడా ప్రారంభమైంది. పాత కలెక్టరేట్‌ను కళాశాలకు కేటాయించగా ఆధునీకరించి వివిధ బ్లాకులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మొదటి సంవత్సరం క్లాసులు జరుగుతున్నాయి. అయితే కళాశాల చుట్టూ నూతనంగా అంతర్గత రోడ్లు వేశారు. అదే సమయాన ప్రభుత్వాస్పత్రిలో కూడా రోడ్లు వేయాలని నిర్ణయించారు. ఆస్పత్రి ముందుభాగంలో కొంతభాగం రోడ్లు తవ్వి కంకర వేయగా.. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో కంకర తేలి అధ్వానంగా తయారైంది.

దుమ్ము, ధూళితో ఇబ్బంది..

అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహనాలు వెళ్లే క్రమంలో దుమ్ము, ధూళి పైకి లేవడంతో ఆస్పత్రికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దాస్పత్రికి నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. ఈక్రమంలోనే ఆస్పత్రి వైద్యులతో పాటు రోగులు, రోగుల సహాయకుల వాహనాలతో ప్రతీ రోజు రద్దీగా ఉంటుంది. దీనికి తోడు 102, 108 వాహనాలు, ఇతర అంబులెన్స్‌లతో ఆస్పత్రి ఆవరణమంతా నిండిపోయినట్లు ఉంటుంది. అసలే అనారోగ్యంతో వచ్చే వారు కావడంతో సరిగా లేని రోడ్డు కారణంగా లేచే దుమ్ముతో మరింత అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారు.

పట్టించుకోని పాలకులు..

మెడికల్ కళాశాల మంజూరైనా.. ప్రభుత్వాస్పత్రిలో రోడ్లు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. దీంతో కళాశాల వచ్చి కూడా ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు. తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఖమ్మం ప్రభుత్వాస్పత్రిని అధికారులు, పాలకులు ఇంత నిర్లక్ష్యం చేయడం తగదని వాపోతున్నారు. ఇకనైనా పాలకులు రోగుల బాధలను దృష్టిలో ఉంచుకొని అంతర్గత రోడ్లు త్వరగా నిర్మించాలని కోరుతున్నారు.

త్వరలో రోడ్లు వేయిస్తాం..

మెడికల్ కళాశాల మంజూరైన సమయాన ప్రభుత్వాస్పత్రిలో కూడా రోడ్లు వేయాలని నిర్ణయించాం. కానీ ఎన్నికల కోడ్ రావడంతో అర్థాంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఈ విషయమై పై అధికారులతో మాట్లాడాను. వారి ఆదేశాల మేరకు త్వరలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడతాం.

– ఎల్.కిరణ్‌కుమార్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

కాంగ్రెస్‌లో ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్‌గా గరిడేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భట్టు రామ్‌జీనాయక్ నియమిస్తూ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అందించిన నియామక పత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాతలింగాల గ్రామంలోని టీపీసీసీ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి నివాసంలో రామ్‌జీనాయక్‌కు మండల పార్టీ ఆధ్వర్యాన శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి రామ్‌జీనాయక్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ఎస్‌ఓ స్వాతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, మాలోత్ సరిరాంనాయక్, ప్రేమ్‌కుమార్, బొడ్డు లక్ష్మీనారాయణ, ఇట్టా శ్రీను, చల్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



రామ్‌జీనాయక్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఘనంగా కరుణగిరినాథుడి రథయాత్ర



సందేశం ఇస్తున్న దైవ సందేశకుడు యుగల్‌కుమార్

ఖమ్మంరూరల్: కరుణగిరి చర్చి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరుణగిరి చర్చి డైరెక్టర్ మాథ్యూవరప్రసాద్‌రాజు ఆధ్వర్యాన కరుణగిరినాథుడి రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవ సందేశకుడు పసుపులేటి యుగల్ కుమార్ దైవ సందేశం ఇచ్చారు. అనంతరం కరుణగిరి పుణ్యక్షేత్రం చుట్టూ కరుణామయుడి రథంతో చేసిన ప్రదక్షిణ నేత్రపర్వంగా సాగింది. డప్పు వాయిద్యాలతో ప్రార్థనలు, కోలాటలతో భక్తులు ఈ యాత్రను కొనసాగించారు. సహాయ గురువులు కొమ్ము నవీన్, రాజు, భక్తులు పాల్గొన్నారు.

'బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదం'



సమావేశంలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్


ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరమని, మరోమారు ఆ పార్టీ గెలిస్తే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ప్రజలగొంతు నొక్కడంతోపాటు నియంతృత్వ విధానాన్ని కొనసాగిస్తున్నారని బీజేపీ తీరును విమర్శించారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ సంస్థలు అమ్మకానికి పెట్టి అతి పెద్ద విక్రేతగా మోదీ ప్రపంచ రికార్డు సృష్టించారని ఎద్దేవా చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేరళ మినహా దేశవ్యాప్తంగా వామపక్షాలు ఇండియా కూటమితో కలిసి పోటీ చేస్తాయన్నారు. పార్టీ పంథా, ప్రస్తుత రాజకీయ పరిస్థితిని వివరించేందుకు ఈ నెల 4న ఖమ్మంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.జానిమియా, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేశ్, కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, గాదె లక్ష్మీనారాయణ, ఎస్.కె.సైదా, తాటినిర్మల, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదిత సెలవులు మంజూరు చేయాలి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్నలు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2022 వేసవి సెలవుల్లో పదో తరగతి పరీక్షల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు నిల్వ చేయమని పాఠశాల విద్యా సంచాలకులు ఆగస్టు 2023లో ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని కోరారు.

వైభవంగా వన దేవతల మినీ జాతర

రఘునాథపాలెం/కామేపల్లి: సమ్మక్క– సారక్క మినీ జాతర వేడుకలు మండలాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి గ్రామంలో, కామేపల్లి మండలం పండితాపురంలో ఈ వేడుకలు జరుగగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కాగా, పాపటపల్లిలో మొదటి రోజు ఊరేగింపుగా వనం నుంచి సారక్కను గద్దెలపైకి తీసుకురాగా, పండితాపురంలో చివరిరోజు కావడంతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీడీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌లతో పాటు గింజల నరసింహారెడ్డి, దొడ్డ శ్రీనివాస్, ధరావత్ అనురాధ, బానోత్ నరసింహానాయక్, మేకపోతుల మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం: పాపటపల్లిలో బోనాలతో వస్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖమ్మంరూరల్: మండలంలోని ఏపుదాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ క్రాంతిసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్ ఉన్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. గుర్రాలపాడు, గుదిమళ్ల, వెంకటగిరి గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్‌లలో సరఫరా ఉండదన్నారు.

ఉచితంగా ఆయుర్వేద వైద్య పరీక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: ఆయుర్ రక్ష ఆయుర్వేదిక్ ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా తమ ఆస్పత్రిలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని సిద్ధార్థ ఆస్పత్రి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి ఉచితంగా పరీక్షలు చేపడుతున్న నేపథ్యాన నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి

కామేపల్లి: పాన్నేకల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న కొత్తపల్లి కమలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి కమలమ్మ అంతిమ సంస్కారాల నిమిత్తం ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి రూ.10 వేల చెక్కును మృతురాలి కుమారుడు నాగయ్యకు అందజేశారు.

పరామర్శ..

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని రాపర్తినగర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావును జిల్లా కాంగ్రెస్ నాయకురాలు, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని బేబి స్వర్ణకుమారి శుక్రవారం వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఆమె వెంట ఉప్పునూతల నాగేశ్వరరావు ఉన్నారు.

ట్రస్మా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎర్షాద్ అహ్మద్



మహ్మద్ ఎర్షాద్ అహ్మద్

కూసుమంచి: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కూసుమంచిలోని గ్లోబల్-రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో కమిటీ బాధ్యులు ఆయనను ఎన్నిక చేయగా.. ట్రస్మా కమిటీల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఎర్షాద్ అహ్మద్ ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, కార్యదర్శి నాయుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి నాసరయ్య, డివిజన్ అధ్యక్షుడు శివకృష్ణ, కార్యదర్శి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. తనకు అప్పగించిన పదవితో పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎర్షాద్ అన్నారు.

'ధరణి' ఫిర్యాదులపై విచారణ ప్రారంభం



తిరుమలాయపాలెం: కాకరవాయిలో విచారణ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి/కామేపల్లి: ధరణి పోర్టల్‌లో రైతులు ఆన్‌లైన్ ద్వారా చేసిన ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి గ్రామీణస్థాయిలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు. శుక్రవారం ఈమేరకు తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కామేపల్లి మండలాల్లో ఫిర్యాదుదారుల భూముల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యాన తిరుమలాయపాలెంలో తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ మూడు రోజుల పాటు, నేలకొండపల్లిలో తహసీల్దార్ గౌరీశంకర్ ఆధ్వర్యాన 9వ తారీకు వరకు, కామేపల్లిలో తహసీల్దార్ సుధాకర్ ఆధ్వర్యాన భూములను పరిశీలించి వాస్తవ స్థితిగతులను అంచనా వేస్తున్నారు. పరిశీలన సమయాన అధికారులకు దరఖాస్తుదారులు ఆ స్థలాలను చూపించాలని, తద్వారా సేకరించిన నివేదికలను జిల్లా అధికారులకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, తిరుమలాయపాలెంలో 160 దరఖాస్తులు రాగా, నేలకొండపల్లిలో 325 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో నేలకొండపల్లి ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, తిరుమలాయపాలెం డీటీలు లక్ష్మణ్, శంకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లహరి, గిర్దావర్ సక్రు, ఏఈఓ శ్రీకన్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లోగో వినియోగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ హకీం

ఖమ్మం సహకారనగర్: తమ సంఘం లెటర్ హెడ్, లోగోలను వినియోగించి సంఘం ప్రతిష్టలను బదనాం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హకీం డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘం నుంచి సస్పెండ్ అయిన వారు లెటర్ హెడ్‌ను ఎలా వాడుకుంటారని ప్రశ్నించారు. సస్పెండ్ అయిన వారు మరికొద్దిమందితో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారని, అలాంటి వారు సరైన సమాధానం చెప్పకుంటే సంఘం ఆదేశాల మేరకు చర్యలుంటాయని హెచ్చరించారు. లెటర్ హెడ్‌లో జిల్లా అధ్యక్షుడి పేరును మార్చి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన బోయినపల్లి రామారావును సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాల మేరకు ఇటీవల తొలగించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.పంతులు, ముఖ్య సలహాదారులు నయీం, ఎం.బాబూరావు, గౌరీరాజు రాములు, జి.విద్యాసాగర్, జిల్లా కోశాధికారి సయ్యద్ యాకూబ్, ఉపాధ్యక్షులు రఫీ, ఎస్‌కె. జానిమియా, అబ్దుల్ పాషా, టౌన్ అధ్యక్షుడు పేరుబత్తిని అబ్బు రాములు, ఖమ్మం టౌన్ కోశాధికారి జాని తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రుణ వసూళ్లపై దృష్టి సారించాలి

రఘునాథపాలెం: రుణ వసూళ్లపై దృష్టి సారించడంతో పాటు సంఘం అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని వీవీపాలెం సహకార సంఘం చైర్మన్ రావూరి సైదబాబు పేర్కొన్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బంగారం తాకట్టు రుణాలు పరిమితిని పెంచుకోని ఎక్కువ మందికి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, సొసైటీలో ఇప్పుడున్న లాకర్ సౌకర్యంతో పాటు అదనంగా మరికొంత మందికి లాకర్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతుల రుణాలు వడ్డీ పెంచి కొత్త రుణాలు ఇవ్వడం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై, సంఘం కార్యాలయం ఎదుట డ్రైయిన్ నిర్మాణం, ఫెన్సింగ్ వేయడం వంటి విషయాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రావేళ్ల శ్రీనివాసరావు, సీఈఓ తిరుపతిరావు, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: ఖమ్మంలో ఈ నెల 3వ తేదీన జరిగే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా విలీన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, పగిడికత్తుల రామదాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు రాయల వెంకటనారాయణ భవనంలో జరిగిన సమావేశంలో వెంకయ్య, నాగేశ్వరరావు, నేలకొండపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా రామదాసు మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులను ఓడించడం కోసం మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు సోమనపల్లి వెంకటేశ్వర్లు, తిమ్మిడి హన్మంతరావు, బానోత్ శంకర్, వెంకటస్వామి. ఎడ్లపల్లి నవీన్, గిరిబాబు, పగిడికత్తుల వెంకటేశ్వర్లు, చిర్రా బిక్షం, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ విధానం వద్దు

ఖమ్మంమయూరిసెంటర్: మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించాలని, అంతేకాని తిరిగి బ్యాంక్ ఖాతాలో చెల్లింపులు అనే పద్ధతిని తీసివేయాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు తాటి నిర్మలలు పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు సైతం ఇదే పద్ధతిని చెప్పి గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ అంటూ మహిళా లోకాన్ని మోసం చేశాయని తెలిపారు. గ్యాస్ కంపెనీలతో మాట్లాడి నేరుగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గత అనుభవాల దృష్ట్యా ఖాతాలలో చెల్లింపులను ఎత్తివేయాలన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2,500లు ప్రతి నెలా అందించే ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రకటించాలని కోరారు.

కుట్లు, అల్లికలపై ఉచిత శిక్షణ

తిరుమలాయపాలెం: నాబార్డ్ వారి సహకారంతో తిరుమలాయపాలెం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వామి వివేకానంద గ్రామీణ అభివృద్ధి సంస్థ(ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యాన మహిళలకు కుట్లు అల్లికపై 15 రోజుల పాటు ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు గౌస్‌మియా శుక్రవారం ప్రారంభించారు. మైక్రో ఎంటర్ప్రైజెస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎంఈడీపీ) కింద 30 మంది ఒక బ్యాచ్‌గా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సమయాన మహిళలకు రూ.750 ఇస్తారని, ఆసక్తి గల మహిళలు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, 2 పాస్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అలివేలు మంగ, సీసీలు నాగేశ్వరరావు, రవి, జైపాల్, సావిత్రి, అనిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఏకవాక్య తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్ణయమే శిరోధార్యమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్ అన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీపై మండల నాయకులు అభిప్రాయ సేకరణకు శుక్రవారం కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ, చెరుకు అభివృద్ధి మండలి, వివిధ దేవాలయాల పాలకవర్గాల నియామకాలపై ఏకవాక్య తీర్మానంతో ఆమోదం తెలపాలని సూచించగా.. అందరూ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. చైర్మన్లు లేక డైరెక్టర్లు తమకు అవకాశం కల్పించాలని పలువురు కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ వజ్జా రమ్య, పార్టీ నాయకులు వెన్నపూసల సీతారాములు, వెనికె జానకిరామయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, గరిడేపల్లి రామారావు, గురవయ్య, మేకల వెంకటేశ్వర్లు, వంగవీటి నాగేశ్వరరావు, ఎం.వెంకన్న, వడ్డె జగన్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని బావోజీతండాకు చెందినధరావత్ సుధాకర్‌పై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు పాల్పడిన రామ్మూర్తి, రమేశ్, చందా, సందీప్‌కుమార్‌పై బాధితుడి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: ఆస్తి పన్ను బకాయిల చెల్లింపులో ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 51వ డివిజన్ కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం కోరారు. శుక్రవారం డివిజన్‌లోని ఆంజనేయస్వామి గుడి వద్ద పన్నుల చెల్లింపు కేంద్రాన్ని అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించిన సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. పాత బకాయిల వడ్డీలో 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవడం ద్వారా నగర వాసులపై భారం తగ్గడంతో పాటు కేఎంసీకి నిధులు సమకూరుతాయని, ఇంటి పన్నుల చెల్లింపులో ఎదురయ్యే సమస్యలనూ పరిష్కరింస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్